సాక్షి
విజయనగరం
సోమవారం । 7 । ఆగస్టు । 2023



పాత్రికేయ వృత్తి గౌరవప్రదం

'సమాజంలో పాత్రికేయ వృత్తికి గౌరవప్రదమైన స్థానం ఉందని' ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు.

- 8లో



సామాజిక సేవే లక్ష్యం

సామాజిక సేవ రోటరీ క్లబ్ ప్రధాన ధ్యేయమని రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) పేర్కొన్నారు.

- 8లో



హిమశ్రీ ప్రతిభ

లక్నోలో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరానికి చెందిన టి.హిమశ్రీ రెండో స్థానంలో నిలిచింది.

- 8లో

న్యూస్‌రీల్

పంచాయతీ ఉప ఎన్నికలకు నోటిఫికేషన్

విజయనగరం రూరల్: జిల్లాలోని 6 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, 54 గ్రామ వార్డుల ఉప ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసిందని జిల్లా పంచాయతీ అధికారి ఎల్ఎన్‌వీ శ్రీధర్‌రాజ తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రి య జరుగుతుందని, 11న నామినేషన్ల పరిశీలన, 12న నామినేషన్ల తిరస్కరణ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. 13న అప్పీలు, 14న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ చేపట్టి, అదే రోజున అభ్యర్థుల జాబితాను ప్రకటించడం జరుగుతుందన్నారు. 19న పోలింగ్ నిర్వహించి, అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టి, సాయంత్రం ఫలితాలు వెల్లడించడం జరుగుతుందన్నారు. విజయనగరం జిల్లా పరిధిలోని విజయనగరం మండలం పడాలపేట, గజపతినగరం మండలం లోగిశ, గంట్యాడ మండలం పీఎస్ఆర్ పురం, వంగర మండలం ఓని అగ్రహారం, లక్ష్మీపేట, పూసపాటిరేగ మండలం కొవ్వాడ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు ఎన్నిక నిర్వహించడం జరుగుతుందన్నారు. దీంతో పాటు 54 వార్డులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల ధర్నాకు అనుమతి లేదు

విజయనగరం ఫోర్ట్: ఆంధ్రప్రదేశ్ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ, ఇతర విద్యుత్ సంఘాలు సోమవారం తలపెట్టిన చలో విద్యుత్ సౌధ, మహాధర్నాలకు ఎటువంటి అనుమతులు లేవని ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరంలో సెక్షన్ 144 సీఆర్‌పీసీ, పోలీస్ సెక్షన్ 30 ప్రకారం నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం జీవో ఆర్‌టీ నంబరు 54 ద్వారా అన్ని ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్లలో ఎస్మా చట్టాన్ని ఉదహరిస్తూ ఆయా సంస్థల్లో పని చేసే వారు ఎటువంటి సమ్మెలను చేయకుండా ఈ ఏడాది మే 10 నుంచి ఆరు నెలల పాటు నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని గుర్తు చేశారు. ఎవరైనా ధర్నాలో పాల్గొంటే వారిపై ఎస్మా చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైతే నిషేధాజ్ఞలు ఉల్లంఘిస్తారో వారిపై ఇండియన్ పీనల్ కోడ్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏపీ కండక్ట్ రూల్స్ ప్రకారం శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు కూడా తప్పవని తెలిపారు.

వట్టిగెడ్డ జలాశయం నీరు విడుదల

జియ్యమ్మవలస: మండలంలోని రావాడ వట్టిగెడ్డ జలాశయం నుండి సాగునీటిని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ఆదివారం విడుదల చేశారు. కుడి ప్రధాన కాలువ నుంచి 30 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 15 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇక వట్టిగెడ్డ ఆయకట్టు భూములకు సాగునీరు పుష్కలంగా లభిస్తుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.శశికళ, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, శిఖబడి సర్పంచ్ కోట రమేష్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

అద్దెకు ఐటీడీఏ షాపులు

సీతంపేట: సీతంపేటలో ఐటీడీఏ నూతనంగా నిర్మించిన షాపులను అద్దెకు ఇవ్వనున్నట్టు ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్యూనిటీ భవనం ఎదురుగా ఉన్న షాపులను నెలకు రూ.6 వేలకు ఒక్కో షాపు అద్దెకు ఇవ్వనున్నామని పేర్కొన్నారు. గుడ్‌విల్ రూ.2లక్షలు కట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల గిరిజన అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9392917692 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు అభినందన



బంగారు పతకం సాధించిన శ్రీలక్ష్మిని అభినందిస్తున్న బంగారమ్మ

నెల్లిమర్ల రూరల్: ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ ఆదివారం అభినందించారు. మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన చుక్కా శ్రీలక్ష్మి, శనపతి పల్లవి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన సంగతి తెలిసిందే. స్వగ్రామానికి చేరుకున్న వాళ్లకి బంగారమ్మ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో మరిన్ని పతకాలు సాధించి గ్రామానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మొయిద అక్కోజీరావు, విద్యా కమిటీ చైర్మన్ బాలి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధితో... వలసలకు చెక్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో జిల్లాలో గణనీయంగా వలసలు తగ్గుముఖం పట్టాయి. సొంతూళ్లలోనే పనులు దొరుకుతుండడంతో సాఫీగా జీవనం సాగిస్తున్నారు. అడిగిందే తడవుగా అధికారులు ఉపాధి పనులు కల్పిస్తుండడంతో వేతనదారులు కుటుంబ సభ్యులతో ఉన్న చోటే హ్యాపీగా జీవిస్తున్నారు.

- నాలుగేళ్లలో కల్పించిన పని దినాలు 11.67 కోట్లు
- వేతనాల కోసం వెచ్చించిన మొత్తం రూ.2599.43 కోట్లు
- మెటీరియల్ కోసం ఖర్చు చేసింది రూ.780.58 కోట్లు
- జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు
- వేతనదారులు 6.98 లక్షలు



విజయనగరం మండలం దుప్పాడ గ్రామంలో పని చేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్:

జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో వలసలు గణనీయంగా తగ్గాయి. గతంలో ఉన్న చోట ఉపాధి దొరక్క ఇతర ప్రాంతాలకు కూలీలు తరలిపోయేవారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఉన్న చోటే కూలీలకు చేతి నిండా పని కల్పించింది. దీంతో వేతనదారులు సొంతూళ్లలోనే పనులకు వెళ్తున్నారు. నాలుగేళ్లలో కోట్లాది పని దినాలు ప్రభుత్వం కల్పించింది. వేతనదారులకు రూ.కోట్లు చెల్లించింది. వేతనదారులకు కూలి చెల్లింపులు కూడా ఎప్పటికప్పుడు జరుగుతున్నాయి. దీంతో వలసలు గణనీయంగా తగ్గాయి. విజయనగరం జిల్లా వేతనదారులకు పని కల్పనలో దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఉపాధి పథకం రాక ముందు జిల్లా వాసులు సుదూర ప్రాంతాలకు పనుల కోసం వెళ్లేవారు. ప్రస్తుతం ఉన్న ఊళ్లలోనే ఉపాధి లభిస్తుండడంతో సాఫీగా జీవనం సాగిస్తున్నారు.

జిల్లాలో జాబ్ కార్డులు 3.45 లక్షలు

జిల్లాలో జాబ్‌కార్డులు 3.45లక్షలు ఉన్నాయి. వీటిలో 3.17 లక్షల జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉన్నాయి. వీటి పరిధిలో 6.98 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో 6.06 లక్షల మంది వేతనదారులు పనులకు వెళ్తున్నారు.

ఒక్కో వేతనదారుడికి రూ.25 వేల వరకు లబ్ధి

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనికి వెళ్లే వేతనదారుడికి వేలాది రుపాయిలు ఏటా అందుతున్నాయి. ఏడాదికి ఒక్కో కుటుంబానికి రూ.25 వేల నుంచి రూ. 30 వేల వరకు లబ్ధి చేకూరుతుంది. ఏటా ప్రభుత్వం కోట్లాది పని దినాలు వేతనదారులకు కల్పిస్తోంది. ఏడాదికి 2 కోట్ల నుంచి 3 కోట్ల వరకు పని దినాలు కల్పిస్తున్నారు. ఇందు కోసం రూ.500 నుంచి రూ.700 కోట్లు వరకు వేతనదారులకు ఏటా చెల్లిస్తున్నారు.

నాలుగేళ్లలో 11.67 కోట్ల పని దినాలు

2019 నుంచి ఇప్పటివరకు జిల్లాలో 11.67 కోట్ల పని దినాలు ప్రభుత్వం కల్పించింది. పనికి వచ్చిన వేతనదారులకు ఇప్పటి వరకు రూ.2599.43 కోట్లు వెచ్చించింది. మెటీరియల్ పనులకు సంబంధించి రూ.780.58 కోట్లు ఖర్చు చేసింది.



2019 నుంచి 2023 వరకు కల్పించిన పని దినాలు, చెల్లించిన నిధులు

సంవత్సరం	పని దినాలు	వేతదారులకు చెల్లించిన నిధులు	మెటీరియల్ పనులకు చెల్లించిన నిధులు
2019-20	2.58 కోట్లు	రూ.563.18 కోట్లు	రూ.62.12 కోట్లు
2020-21	3.06 కోట్లు	రూ.731.85 కోట్లు	రూ.312.70 కోట్లు
2021-22	2.55 కోట్లు	రూ.527.78 కోట్లు	రూ.198.00 కోట్లు
2022-23	1.95 కోట్లు	రూ.406.55 కోట్లు	రూ.114. 61 కోట్లు
2023-24	1.53 కోట్లు	రూ.370.07 కోట్లు	రూ.93.15 కోట్లు

ఏడాదికి రూ.25 వేల లబ్ధి



నాలుగేళ్లుగా ఉపాధి పనులకు వెళ్తున్నాను. ఏడాదికి రూ.25వేల వరకు లబ్ధి చేకూరుతుంది. సొంత గ్రామంలోనే పనిదొరకడం వల్ల పనికి రోజూ వెళ్తున్నాను. వేతనదారులకు పని కల్పించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం ఆనందంగా ఉంది. నాతో పాటు వందలాది మంది మా గ్రామంలో పనికి వస్తున్నారు.

– రంధి నాగేశ్వరరావు, వేతనదారుడు, పెదవేమలి గ్రామం

వలసలు తగ్గాయి...



ఉపాధి పథకం పనులు లేక మునుపు మద్రాసు, హైదరాబాద్ పని కోసం గ్రామస్తులు వెళ్లేవారు. అక్కడే ఆరు నెలల వరకు పనులు చేసుకుని వచ్చేవారు. ఉపాధి పథకం వల్ల గ్రామంలోనే పని దొరుకుతుంది. ప్రభుత్వం డబ్బులు కూడా వెంటనే జమ చేస్తుంది. కుటుంబం అంతా సాఫీగా జీవనం సాగిస్తున్నాం.

– సిరపురపు అప్పుడు, కోరుకొండపాలేం, విజయనగరం మండలం

ఏటా కోట్లాది పని దినాలు



జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ఏటా కోట్లాది పని దినాలు కల్పిస్తున్నాం. ఇందుకోసం వేతనాల రూపంలో రూ.కోట్లు చెల్లిస్తున్నాం. జాబ్ కార్డు కల్గిన ప్రతి ఒక్కరికి పనికల్పిస్తున్నాం. సొంత గ్రామంలో పని కల్పించడం వల్ల అధిక సంఖ్యలో వేతనదారులు పనికి వస్తున్నారు. వేతనం కూడా పనిచేసిన దానికి గిట్టుబాటు అయ్యే విధంగా వచ్చింది. అన్ని వర్గాల వారు ఉపాధి పనులకు వస్తున్నారు.

– జి.ఉమాపరమేశ్వరి, పీడీ, డ్వామా

వేతనదారులకు గిట్టుబాటు వేతనం

ఉపాధి హామీ పథకంలో భాగంగా పనికి వచ్చే ప్రతి వేతనదారుడికి ప్రభుత్వం కనీస వేతనం వచ్చే విధంగా చర్యలు చేపట్టింది. గరిష్ట వేతనం రూ.272 కాగా వేతనదారులకు రూ.240 నుంచి రూ.272 వరకు వేతనం వచ్చే విధంగా చర్యలు తీసుకుంది. దీని వల్ల పనిచేసిన దానికి వేతనం గిట్టుబాటు అయింది. వేతనాలు కూడా వారం రోజుల్లో ఖాతాల్లో జమవుతుండడంతో వేతనదారులు ఉత్సాహంగా పనులకు వెళ్తున్నారు.

అమ్మవారికి పంచామృతాభిషేకం



చీపురుపల్లి పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆదివారం విశిష్ట దినోత్సవం కావడంతో ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరవెల్లి రవిశర్మ ఆధ్వర్యంలో పంచామృత క్షీరాభిషేకం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మ వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.

– చీపురుపల్లి

ప్రజా గాయకుడికి నివాళి



ప్రజా గాయకుడు గద్దర్ మృతి సాహితీ లోకానికి తీరనిలోటని పాలకొండ మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఆర్టిస్ట్ పక్కి ప్రేమ్‌కుమార్ అన్నారు. రావి ఆకుపై గద్దర్ రూపాన్ని ఆవిష్కరించి ఆయనకు నివాళి అర్పించారు.

-పాలకొండ రూరల్

ప్రాజెక్టుల పరిశీలన పేరిట.. చంద్రబాబు అరాచక రాజకీయాలు



- అధికార దాహంతో సంయమనం కోల్పోతున్న చంద్రబాబు
- పుంగనూరు ఘటనలో పోలీసులపై దాడి హేయమైన చర్య
- గన్‌లు.. తుపాకులు ఆట వస్తువులా...?
- ప్రాజెక్టుల పరిశీలనలో వాస్తవాలు మాట్లాడాలి
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం:

ప్రతిపక్ష నేత చంద్రబాబు చేపడుతున్న ప్రాజెక్టుల పరిశీలన సమయంలో టీడీపీ నేతల వాహనాల్లో గన్‌లు... తుపాకులు... ఆట వస్తువల్లా వినియోగించటంపై అంతర్యమేంటని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు ప్రశ్నించారు. ఇలాంటి ఆయుధాలను వాహనాల్లో ఎలా వినియోగిస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జలవనరుల శాఖపై నిర్లక్ష్యం వహించిందంటూ ప్రతిపక్ష నేతగా చంద్రబాబు చేస్తున్న కార్యక్రమాన్ని స్వాగతిస్తున్నామన్న ఆయన ప్రాజెక్టుల సందర్శన అనే పేరిట పుంగనూరు సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక ప్రతిపక్ష నేతగా 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పరిపాలించిన వ్యక్తి అధికార దాహంతో సంయమనం కోల్పోయి కార్యకర్తలను హింసకు ప్రేరిపించడం ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్‌కు రాజకీయ భవిష్యత్తు లేదన్న నిర్ణయానికి వచ్చి రాష్ట్రంలో ఆరాచకాలను సృష్టిస్తున్నారని వాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో చట్టాలను ఎవరి చేతుల్లోకి తీసుకోకుండా ప్రజల తాలూకా స్వాతంత్ర్యాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీస్ వ్యవస్థదని, అటువంటి పోలీస్ వ్యవస్థపై టీడీపీ అనుచరగణం దాడి చేయడం హేయమైన చర్యన్నారు. ఈ దాడిలో సుమారుగా 50 మంది క్షతగాత్రులవ్వడం, చంద్రబాబు సమక్షంలోనే పోలీస్ వ్యాన్‌లను తగలబెట్టడం హేయమైన చర్యగా ఖండించారు. చంద్రబాబు చేస్తున్న దుశ్చర్యలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు.

ఎవరి హయాంలో.. ఎన్ని ప్రాజెక్ట్‌లు ప్రారంభించి పూర్తి చేశారు చంద్రబాబు

రాష్ట్రంలో, ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎవరి హయాంలో ఎన్ని ప్రాజెక్టులు ప్రారంభించారు... ఎంత మొత్తంలో నిధులు మంజూరు చేశారు... ఎవరి హయాంలో వాటిని పూర్తి చేశారు.... ఎవరి హయాంలో ప్రారంభించారో... చంద్రబాబు, ఆ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల చంద్రబాబు వాడుతున్న భాష సరికాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో లోపాలను ఎత్తి చూపించలేకపోయారన్నారు.

అధికారమే పరమావధిగా చంద్రబాబు చర్యలు

అధికారమే పరమావధా.. అధికారం కోసం మీరు ఏదైనా చేస్తారా... కొన్ని చానళ్లు, పత్రికలు అయితే ఇంత హింస జరిగినా అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీపై బురద జల్లే ప్రయత్నం చేయటమేనా మీ సిద్ధాంతాలు... మీ నీతి నిజాయితీలు అంటూ మజ్జి శ్రీనివాసరావు మండిపడ్డారు. ప్రాజెక్టుల పరిశీలన పేరిట స్వయనా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్వంత జిల్లాలో శాంతియుతంగా చంద్రబాబు పర్యటన సాగటమే ప్రజాస్వామ్య ప్రభుత్వానికి నిదర్శనమన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు.

హింసను సృష్టించటమే చంద్రబాబు ధ్యేయం

ప్రతిపక్ష నేత చంద్రబాబు తనకు రాజకీయ భవిష్యత్ లేదన్న బాధతో రాష్ట్రంలో కుల, మతాలు, భాషాపరంగా ప్రజలను రెచ్చగొట్టి హింసను సృష్టించటమే ధ్యేయంగా పెట్టుకున్నారన్నారు. పుంగనూరులో పోలీసులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, టీడీపీ నేతల దాడిలో గాయాల పాలైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో మారు రాష్ట్రంలో ఇటువంటి దుశ్చర్యలకు తావులేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. చంద్రబాబు చేపడుతున్న ప్రాజెక్టుల పరిశీలన కార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రాజెక్టులను పరిశీలించి వాస్తవాలు మాట్లాడాలని సూచించారు.

నవంబరులో అయ్యప్ప మహాసంగమం

- ఏబీఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమోహన్‌రెడ్డి

చీపురుపల్లి: చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నవంబరులో జరగనున్న శ్రీ అయ్యప్ప మహాసంగమం కార్యక్రమాన్ని ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల్లో ఉన్న అయ్యప్ప స్వాములు, ఆధ్యాత్మిక భక్తులు విజయవంతం చేయాలని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.పైల ఆదిమోహన్‌రెడ్డి అన్నారు. శ్రీ అయ్యప్ప మహా సంగమం కార్యక్రమం నిర్వహణకు సంబంధించి ఆదివారం పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వా మి దేవాలయం నిర్మాణ పనుల ఆవరణలో ఉత్తరాంధ్ర జిల్లాల సంఘ ప్రతినిధులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 24, 25, 26 తేదీల్లో విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో మహా సంగమం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీ అయ్యప్ప మహాసంగమం కార్యక్రమాన్ని నిర్వహణ కోసం కమిటీను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రుద్రకోటీశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి క్లాసిక్ రమణ, పోతుల రాము, గవిడి సత్యనారాయణ, ఆనంద్ గురుస్వాములు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏబీఏపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిమోహన్‌రెడ్డి

కమిటీ సభ్యులు వీరే..

నవంబరు 24, 25, 26 తేదీల్లో జరగనున్న శ్రీ అయ్య ప్ప మహాసంగమం నిర్వహణ కోసం పూజా కమిటీ ని నియమించారు. కమిటీ కన్వీనర్‌గా జి.రాజేశ్వరరావు, చైర్మన్‌గా ఎం.కిష్టయ్య, వైస్ చైర్మన్‌గా టి.శ్రీనివాసరావు, ప్రెసిడెంట్‌గా రుద్ర కోటీశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా డి.శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా జి.తాటినాయుడు, జాయింట్ సెక్రటరీగా చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్.హరిప్రసాద్, కోఆర్డినేటర్‌గా క్లాసిక్ రమణ తదితరులను నియమించారు.

రైలు ప్రయాణికులకు ప్రయోజనకరం

- అమృత్ భారత్ పథకంలో విజయనగరం ఎంపిక హర్షణీయం
- శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి
- వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ

విజయనగరం టౌన్: విజయనగరం రైల్వేస్టేషన్ పలు రాష్ట్రాలను కలిపే ముఖ్య కూడలని, ఈ స్టేషన్ అన్ని రకాలుగా అభివృద్ధి చెందితేనే పలు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంతో ప్రయోజనకరమని శాసన సభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా 508 రైల్వేస్టేషన్‌ల పునరాభివృద్ధికి వర్చువల్ విధానంలో ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఎంపికైన వాటిలో విజయనగరం రైల్వేస్టేషన్ ఒకటి కావడంతో రైల్వేస్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు డిప్యూటీ స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలకు విజయనగరం జిల్లా ప్రధాన కేంద్రం కావడం, అటువంటి రైల్వేస్టేషన్‌ను రూ.35 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయడానికి ఎంపిక చేయడం అభినందించదగ్గ విషయమన్నారు.



రైల్వేస్టేషన్ ప్రాంతంలో శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, రైల్వే అధికారులు



కార్యక్రమానికి హాజరైన రైల్వే సిబ్బంది, ప్రజలు

అభివృద్ధి అనేది కేవలం ఒక రోజులోనో, నెల రోజుల్లోనో జరిగేది కాదని, ఇది నిరంతర ప్రక్రియన్నారు. దేశంలోనే అతిపెద్ద రైల్వేశాఖల్లో రైల్వే ఒకటని, ఇటువంటి శాఖను ఆధునీకరించి మోడల్ స్టేషన్‌లుగా తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు. మోడల్ స్టేషన్‌లో అధునాతన సౌకర్యాలు కలుగుతాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రంలోని ఒక విజన్ ఉన్న నేత మోదీ అని, ఆయన ఏ మంచి కార్యక్రమం తలపెట్టినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామన్నారు. దేశాభివృద్ధిలో ప్రజా రవాణాలో రైల్వేది కీలకపాత్ర అన్నారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడుతూ మన రాష్ట్రంలో 18 రైల్వేస్టేషన్‌లను ఈ పథకంలో అభివృద్ధి చేస్తున్నందుకు కేంద్రానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో దేశంలో పెద్ద ఎత్తున జాతీయ రహదారులను విస్తరించారన్నారు. రైల్వే నెట్‌వర్క్ అభివృద్ధి సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో భాగంగా రైల్వే భద్రత, ప్రయాణికుల బాధ్యతలు తదితర అంశాలపై రైల్వే ఉద్యోగులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. రైల్వే నిర్మాణ విభాగం చీఫ్ ఇంజినీర్ కె.ధనుంజయరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బవిరెడ్డి శివప్రసాదరెడ్డి, కుసుమంచి సుబ్బారావు, బొబ్బిలి శ్రీను, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్



పట్టుకున్న జూదరులతో ఎస్సై హరిబాబు నాయుడు

గుర్ల: మండలంలోని గరికివలస శివారులో పేకాట స్థావరంపై ఎస్సై హరిబాబు నాయుడు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో 18 మంది జూదరులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 1,01600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో పేకాట, బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారి వివరాలు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

20 మద్యం సీసాలతో నిందితుడి అరెస్ట్



రేగిడి: పోలీస్‌స్టేషన్‌లో నిందితుడితో పాటు, మద్యం సీసాలను చూపిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

రేగిడి: మండల పరిధిలోని మంగలపేట గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న నిందితుడిని ఎస్సై ఇ.శ్రీనివాసరావు ఆదివారం అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశారు. ఈ సందర్భంగా నిందితుడి దగ్గర పట్టుబడిన 20 సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆకతాయిల ఆగడాలు

- హైస్కూల్‌లో ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్ల చోరీ



హైస్కూల్ తరగతి గది తలుపులు పగుల గొట్టి గోడలపై ఉమ్మి పాడు చేసిన దృశ్యం

వేపాడ: మండలకేంద్రం వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఆకతాయిలు తరగతి గదుల తలుపు పగులగొట్టి గదులలో గోడలు పాడుచేయడంతో పాటు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు చోరీ చేస్తున్నారు. గత నెలలో నాలుగైదు పర్యాయాలు ఇలా జరగ్గా సుమారు 13 ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు చోరీకి గురయ్యాయి. నాడు నేడు పనులకు తెచ్చిన ఐరన్ చోరీకి గురికావడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు ఈ చర్యలను నిరోధించాలని కోరుతున్నారు.

పూరిల్లు దగ్ధం



చామలాపల్లిలో అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న పూరిల్లు

వేపాడ: మండలంలోని చామలాపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఓ పూరిల్లు అగ్నికి ఆహుతైంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మిగడ లక్ష్మీకాంతం వంటచేస్తూ ఎండుమిరపకోసం దుకాణానికి వెళ్లింది. ఇంతలో మంటలు చెలరేగి తాటాకులకు అంటుకోవడంతో ఒక్కసారిగా ఇల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో లక్ష్మీకాంతం అప్పుగా తెచ్చుకున్న రూ.70వేలు, తులంన్నర బంగారం తాడు, కూలీనాలీ చేసుకున్న సొమ్ము రూ.పదివేలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ సమాచారం తెలుసుకున్న ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేయడంతో పాటు గ్యాస్ సిలిండర్ పైకి తీయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. సమచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి స్టేట్‌మెంట్ తీసుకున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

అర్చకులకే ఆలయాలు

- రూ.5 లక్షలలోపు ఆదాయం ఉన్న వాటిని అప్పగించేలా నిర్ణయం
- ఈ కేటగిరీలో 394 ఆలయాలున్నట్లు అంచనా



భామిని: ఆలయంలో పూజలు చేస్తున్న పూజారి

మహారాణిపేట (విశాఖ దక్షిణ): దేవాలయ వ్యవస్థలో సమూల మార్పులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అర్చకులకు వంశపారంపర్య ధర్మకర్తల హక్కులు ఇవ్వడం, అర్చకుల జీతాలను పెంచడం, రెండు లక్షల రూపాయలలోపు ఆదాయం ఉన్న ఆలయాలను అర్చకులకు అప్పగించారు. ఇప్పుడు రూ.5 లక్షలలోపు ఆదాయం వచ్చే ఆలయాలను అర్చకులకు అప్పగిస్తూ ఇటీవల మంత్రి వర్గం ఆమోదించింది. దీనిపై దేవదాయశాఖ కమిషనర్ మార్గదర్శక సూత్రాలు విడుదల చేశారు.

జిల్లా పేరు	నాన్ ఎసెస్‌బుల్,	6(సి),	6(బి)	మొత్తం దేవాలయాలు
శ్రీకాకుళం	39	43	05	87
మన్యంజిల్లా (పార్వతీపురం)	05	25	04	34
విజయనగరం	79	26	03	108
విశాఖ	33	11	-	44
అనకాపల్లి	76	36	06	118
అల్లూరి సీతారామ రాజు పాడేరు జిల్లా	03	-	-	03
	232	144	18	394

వివరాల సేకరణలో అధికారులు

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లో రూ.5 లక్షల ఆదాయం వచ్చే ఆలయాలు, ధర్మకర్తలు, వ్యవస్థాపక ధర్మకర్తల వివరాలను దేవదాయశాఖ అధికారులు సేకరిస్తున్నారు. భక్తులు సమర్పించే కానుకలతోపాటు ఆలయాల ఆవరణలో ఏర్పాటు చేసుకునే షాపుల నుంచి వచ్చే అద్దెలు, దేవాలయ భూముల మీద వచ్చే శిస్తులు, టికెట్ల విక్రయం ద్వారా ఆదాయం పరిగణనలోకి తీసుకుని ఏడాది ఆదాయాన్ని లెక్కిస్తున్నారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలు అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో మొత్తం 394 ఆలయాలున్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

వివరాల సేకరణ

ప్రభుత్వ ఆదేశాల మేరకు రూ.5 లక్షలలోపు ఆదాయం కలిగిన ఆలయాల వివరాలు తెలుసుకుంటున్నాం. త్వరలో దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక పంపుతాం.
– ఎస్.సుజాత, డిప్యూటీ కమిషనర్, దేవదాయశాఖ, విశాఖపట్నం

హక్కుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

సహాయ కమిషనర్ కార్యాలయంలో ఎవరెవరు ఏ ఆలయాల్లో పనిచేస్తున్నారో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి కమిషనర్‌కు నివేదిక పంపుతాం. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ఆలయాల నిర్వహణ వారికి అప్పగిస్తాం. విశాఖ జిల్లాలో 33 ఆలయాలకు వంశపారంపర్య ధర్మకర్తలు, వ్యవస్థాపక ధర్మకర్తలు ఉన్నారు.
– కె.శిరీష, సహాయ కమిషనర్ (అసిస్టెంట్ కమిషనర్) దేవదాయ శాఖ, విశాఖ జిల్లా

ఆదాయాన్ని బట్టి కేటగిరి విభజన

దేవదాయ, ధర్మాదాయ శాఖలో ఆదాయ వివరాలను బట్టి కేటగిరిగా విభజిస్తున్నారు. రూ 50 వేల లోపు ఆదాయం వచ్చే ఆలయాలను నాన్ ఎసెస్‌బల్ కింద పరిగణిస్తారు. ఏడాదికి రూ.25 లక్షల నుంచి కోటి రూపాయలకుపైగా ఆదాయం వచ్చే ఆలయాలను 6ఎ కింద విభజిస్తారు. ఏడాదికి రెండు లక్షల నుంచి రూ.25 లక్షలలోపు ఆదాయం వచ్చే దేవాలయాలను 6బి కింద, ఏడాదికి రూ.2 లక్షల లోపు ఉంటే 6సి కింద విభజిస్తారు.

సీతంపేటలో పర్యాటకుల సందడి



క్లైంబింగ్ వాల్ ఎక్కుతున్న యువతి



బోటుషికారు చేస్తున్న పర్యాటకులు



బంజీట్రంపోలిన్ చేస్తున్న బాలిక

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో అడ్వెంచర్ పార్కు కళకళలాడింది. జలవిహార్‌లో బోటుషికారు, హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడక, కయాకింగ్, బంజీట్రంపోలిన్, జెయింట్ వీల్ నడిపి ఆనందించారు.

ఐటీబీపీ కానిస్టేబుల్ అదృశ్యం



పట్నాల రాంబాబు, ఐటీబీపీ కానిస్టేబుల్

విజయనగరం క్రైమ్: ఇండో టిబెటిన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)లో పనిచేస్తున్న కానిస్టేబుల్ కనబడడం లేదని కుటుంబసభ్యులు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనికి సంబంధించి ఎస్సై గణేష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. హర్యానాలోని పాంచ్‌పూల్ జిల్లాలో ఐటీబీపీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పట్నాల రాంబాబు ఈ ఏడాది మే 22న 15 రోజుల పాటు సెలవు పెట్టి స్వస్థలం విజయనగరం సమీప సారిక గ్రామం వస్తున్నట్లు అధికారులకు చెప్పి వెళ్లిపోయాడు. అయితే నాటి నుంచి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులతో కాంటాక్ట్ కూడా లేకపోవడంతో సోదరుడు మహేష్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విద్యార్థిని ఆత్మహత్య

పార్వతీపురం: కొమరాడ మండలం రావికోనకు చెందిన కిల్లక స్వాతి(18) శనివారం రాత్రి పురుగు మందును తాగి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలిలా ఉన్నాయి. స్వాతి ఇంట్లోనే పురుగు మందు తాగిన వెంటనే కుటుంబసభ్యులు కురుపాం ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్సకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పాత్రికేయ వృత్తి గౌరవప్రదం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- ఏపీయూడబ్ల్యూజే 26వ వార్షిక సర్వసభ్య సమావేశం



జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏపీయూడబ్ల్యూజే26వ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సాక్షి బ్యూరో ఎ.సూరిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: 'సమాజంలో పాత్రికేయ వృత్తికి గౌరవప్రదమైన స్థానం ఉందని' ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏపీయూడబ్ల్యూజే 26వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ స్పీకర్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల్లో ఉండి ఎన్నో వ్యయ, ప్రయాసలకు ఓర్చి వార్తల సేకరణ చేసేది పాత్రికేయులేనన్నారు. సవాళ్లతో కూడుకున్న పాత్రికేయ వృత్తిలో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. కొన్ని అవాస్తవ వార్తలతో ఇబ్బందులు ఎదురవుతాయని, వాటిపై పాత్రికేయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొత్తగా పాత్రికేయ రంగంలోకి వచ్చే వారు సీనియర్ పాత్రికేయులను ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని చెప్పారు. పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఇంటి స్థలాల మంజూరుకు అర్హులైన జర్నలిస్టుల జాబితా అందించాలని సూచించారు. అలాగే యూనియన్ నాయకులు పాత్రికేయుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు కృషి చేయాలని కోరారు.

వారధిగా పాత్రికేయులు

జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పాత్రికేయ రంగం పనిచేస్తుందన్నారు. ప్రజాసామ్యంలో ప్రధాన భూమిక పత్రికా రంగానిదేనన్నారు. దేశంలో పాత్రికేయ రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉందని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారంలో పాత్రికేయుల కృషి మరువలేనిదన్నారు. కోవిడ్, హుదూద్ సమయాల్లో ప్రాణాలను పణంగా పెట్టి పాత్రికేయులు పని చేశారని ప్రశంసించారు. పాత్రికేయ మిత్రులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీలు ఐ.రఘురాజు, పి.సూర్య నారాయణ రాజులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు ప్రజల కోసం నిత్యం పనిచేస్తుంటారని, ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి అప్రమత్తం చేయడంలో పాత్రికేయుల కృషి మరువలేనిదన్నారు. తప్పు చేస్తే ఎత్తు చూపేది పాత్రికేయ రంగమేనన్నారు.

మృతుల కుటుంబాలు ఆదుకోవాలి

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ కరోనా సమయంలో వృత్తిలో భాగంగా ఎంతో మంది పాత్రికేయులు మరణించారని, వారిని ఆదుకోవడానికి ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేసేందుకు కృషి చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. అలాగే జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరయ్యేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ విజయనగరం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున మాట్లాడుతూ సమాజాన్ని రూపుదిద్దడంలో పాత్రికేయులదే కీలకపాత్రని అన్నారు. పాత్రికేయులు నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని సూచించారు. ఏపీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి చందూ జనార్దన్, సామ్నా అధ్యక్షుడు నల్లి ధర్మారావు పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమానికి ఏపీయూడబ్ల్యూజే చేస్తున్న కృషిపై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆచారి శివ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్ఎస్‌వీ ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులు డి.అచ్యుతరావు, ఎస్.ఈశ్వరరావు, కూన పాపారావు, శేషగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా అల్లు సూరిబాబు

ఈ సందర్భంగా జెడ్పీ సమావేశం మందిరంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడిగా విజయనగరం సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ అల్లు సూరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వి.మహాపాత్రో (సూర్య), పంచాది అప్పారావు (పవర్), ఆరిపాక రాము (వార్త), బళ్లమూడి నాగేంద్రప్రసాద్ (విశాలాంధ్ర), కార్యదర్శిగా ఎం.ఎస్ఎన్.రాజు (జిల్లా వాణి), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వేదుల సత్యనారాయణ (లీడర్), సహాయ కార్యదర్శిగా వి.అశోక్ (సీమాంధ్ర), సన్యాసిరావు (విశాలాంధ్ర), కోశాధికారిగా కుసుమంచి శ్రీనివాసరావు (హిందూ), మరో 18 మంది కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు. ఎంపికైన సభ్యులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అభినందించారు. అనంతరం 20 ఏళ్లుగా పాత్రికేయరంగంలో సేవలందించిన 125 మందికి పైగా సీనియర్ పాత్రికేయులను ఘనంగా సత్కరించారు.

హిమశ్రీ ప్రతిభ గర్వకారణం



హిమశ్రీని అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: లక్నోలో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరానికి చెందిన టి.హిమశ్రీ రెండో స్థానంలో నిలిచి రజత పతకం సొంతం చేసుకోవడం మన ప్రాంతానికే కాకుండా, రాష్ట్రానికే గర్వకారణమని ఏపీ శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం వైఎస్సార్ నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారిణి హిమశ్రీని ప్రత్యేకంగా ఆయన అభినందించారు. స్థానిక కస్పా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని సెప్టెంబర్‌లో కేరళలో జరిగే సాయ్ లీగ్ పోటీలకు అర్హత సాధించిందని, అక్కడా విజయం సాధించి విజయనగరం ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపటాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్వీవీ రాజేష్, జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీను యాదవ్, కార్పొరేటర్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ప్రధాన ధ్యేయం సామాజిక సేవ

- రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావు



వేదికపై రోటరీక్లబ్ ప్రతినిధులు

విజయనగరం: సామాజిక సేవ రోటరీ క్లబ్ ప్రధాన ధ్యేయమని రోటరీ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని రింగ్ రోడ్డులో గల సుజాత కన్వెన్షన్ హాలులో ఆదివారం రోటరీ డిస్ట్రిక్ట్ ప్రతినిధుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గవర్నర్ సుబ్బారావు ప్రసంగిస్తూ అంతర్జాతీయ స్థాయిలో విస్తరించి ఉన్న రోటరీ క్లబ్ ప్రథమ లక్ష్యం సామాజిక సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ అని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ద్వారా కోట్లాది రూపాయలు వెచ్చించి ఏటా స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు, పాఠశాలలకు మౌలిక సదుపాయాలు, గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాలు నిర్మిస్తున్నామని వివరించారు. వీటితోపాటు పోలియో నియంత్రణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని తెలిపారు. పట్టణాలలో రక్తనిధి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు బెంచీలు లక్షలాది రూపాయలు వెచ్చించి సమకూర్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సెమినార్‌లో రోటరీ మెంబర్‌షిప్ లక్ష్యంగా శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు ఉన్న అన్ని క్లబ్‌లలో ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం క్లబ్ అధ్యక్షుడు వి.వి రాజేష్, అరుణ్ సోధాని, టీఎల్ఎన్ మూర్తి, యునైటెడ్ శ్రీనివాస్, జి.శివకుమార్, మడిపల్లి రామారావు, డాక్టర్ వెంటేశ్వరరావు, ఆర్ శంకర్‌రెడ్డి, అనీష్, బత్తుల చందు, కాపుగంటి రవి, మాటూరు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బీఎస్సార్ మూర్తి మృతి తీరని లోటు



డాక్టర్ బీఎస్సార్ మూర్తి పాడె మోస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, బీఎస్సార్ కుటుంబసభ్యులు



డాక్టర్ బీఎస్సార్ మూర్తి భౌతిక కాయానికి పూలమాల వేసి అంజలి ఘటిస్తున్న జెడ్పీ చైర్మన్ తదితరులు

- అంత్యక్రియల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, ఎంపీ

గజపతినగరం: వైద్యరంగంలో విశిష్టమైన సేవలు అందిస్తూ మరో వైపు సామాజిక వేత్తగా పేరుప్రఖ్యాతులు గాంచిన డాక్టర్ బీఎస్సార్ మూర్తి మృతి తీరని లోటు అని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులు అన్నారు. ఈ మేరకు ఆదివారం వారు గజపతినగరంలో ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి సంతాపం తెలియజేశారు. వారితో పాటు గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి జెడ్పీటీసీలు గారతవుడు, రౌతు రాజేశ్వరి, రాపాక సూర్యప్రకాశ్‌లతో పాటు రేగిడి ఎంపీపీ అచ్చంనాయుడు, తాడ్డి భాస్కరరావు, తాడ్డి రవి, డాక్టర్ వి.కృష్ణారావు, డాక్టర్ ఏఎల్.నాయుడు, చైతన్య భారతి కార్యదర్శి బొంతల కోటి శంకర్ రావు, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథ రావు, మండల సురేష్, కరణం ఆదినారాయణ, కర్రిరామునాయుడు, కర్రినానాజీ, సామంతుల పైడి రాజు, రేగ సురేష్, తదితర గ్రామీణ ప్రాంతాల ప్రజానీకం వచ్చి ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. అలాగే విజయనగరం ప్రేమ సమాజం, లయన్స్ క్లబ్, చైతన్య భారతి సభ్యులు, విజయనగరం జిల్లా వైద్య బృందం బీఎస్సార్ నివాస గృహానికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేశారు. అనంతరం డాక్టర్ బీస్సార్ మూర్తి అంత్యక్రియలు నిర్వహించారు.

కారు ఢీకొని బాలికకు తీవ్రగాయాలు

భోగాపురం: మండలంలోని గాబువానిపేట గ్రామానికి చెందిన బాలిక ఇప్పిలి హిమబిందు కారు ఢీకొని తీవ్ర గాయాలపాలైంది. శనివారం రాత్రి గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. మూడవ తరగతి చదువుతున్న హిమబిందు స్నేహితులతో కలిసి శనివారం రాత్రి రోడ్డు పక్కన ఆడుకుంటుండగా భోగాపురం నుంచి ముక్కాం వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైంది. హుటాహుటిన బాలికను సుందరపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలిక తండ్రి రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

విజయనగరం క్రైమ్: అయ్యన్నపేటకు చెందిన కట్టమూరి లక్ష్మి (55) రోడ్డు ప్రమాదంలో ఆదివారం మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జంక్షన్‌లో ఆమె రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన జిల్లా కేంద్రాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై మురళి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని చిన్నారి..

మక్కువ: మండలంలోని ఆలగురువు గ్రామానికి చెందిన కర్ర ఆశిష్‌కుమార్(10) రెండు బైక్‌లు ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఆదివారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆశికుమార్‌ను ద్విచక్రవాహనంపై ముందు కూర్చుండబెట్టుకుని మక్కువ నుంచి గ్రామానికి వెళ్తున్నారు. అదే సమయంలో ఒడిశా రాష్ట్రంలోని నాగలబెడ్డ పంచాయతీ తనువులు గ్రామానికి చెందిన మెల్లిక పాపారావు ద్విచక్ర వాహనంపై మక్కువ వస్తుండగా బొడ్డు సామంత వలస గ్రామ మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆశిష్‌కుమార్‌కు తీవ్ర గాయాలవడంతో వెంటనే మక్కువలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై జి.పైడిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో జారిపడి వ్యక్తి..

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి వస్త్రపురికాలనీకి చెందిన ముంతా వెంకటరమణ (56) మృతదేహం సీతయ్యచెరువులో ఆదివారం లభ్యమైంది. దీనికి సంబంధించి ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటరమణ ఈ నెల 2 సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అప్పటి నుంచి కుమారుడు ప్రసాద్ అన్ని ప్రాంతాల్లో వెతకడంతోపాటు బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీశాడు. ఆదివారం ఉదయం సెయింట్‌ఆన్స్ ఆస్పత్రి వెనుకభాగంలోని సీతయ్య చెరువు వైపు వెళ్లి చూశాడు. చెరువు ఒడ్డున చెప్పులు, సెల్‌ఫోన్ ఉండడాన్ని గమనించి చెరువులో వెతకగా తండ్రి శవమై కనిపించాడు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.